# ప్రాణం వచ్చిన రోబోట్‌లు

ఆ రోజు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వార్షికోత్సవం.

ఆ సందర్భంలో గెస్ట్ లెక్చర్ ఇయ్యడానికి డాక్టర్ మదన్‌ని ఆహ్వానించారు.

అయన కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాక స్పెషలైజేషన్ కోసం విదేశాలకు వెళ్ళాడు. అక్కడ స్పెషల్ కోర్స్‌లలో డిప్లమాలు పొంది జాపాన్‌కి వచ్చాడు. అక్కడ మూడు సంవత్సరాలపాటు ఒక ప్రసిద్ధ కంపెనీలో స్పెషలైజ్డ్ ట్రైనింగ్ తీసుకున్నాడు. ఆ కంపెనీయే అయనకి మంచి జీతం, ఇతర సదుపాయాల మీద మంచి ఉద్యోగాన్ని ఆఫర్ చేసింది కాని స్వదేశం మీదున్న అభిమానంతోపాటు తెలిసిన మిత్రులు తాము స్థాపించిన 'ట్వెంటీఫస్ట్ సెంచరీ కంప్యూటర్స్' అన్న సంస్థకి చీఫ్ ఎడ్వయిజర్‌గా రమ్మని అహ్వానించడంతో ఇండియాకి వచ్చేశాడు. ఇండియాలో వున్న అన్ని కంప్యూటర్ సంస్థల కంటె హైదరాబాద్‌లో వున్న ఈ సంస్థే అతి పెద్దది. భారతీయ ప్రమాణాలతో పోలిస్తే చాలా మంచి జీతాన్ని, సదుపాయాల్ని డాక్టర్ మదన్‌కి కల్పించారు వారు.


డాక్టర్ మదన్‌కి కంప్యూటర్ సైన్స్‌లో అథారిటీ అని పేరు. ఆయనకి దేశంలోనే కాక విదేశాలలోనూ మంచి పరిగణన ఉంది. ఆయన వ్యాసాలు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రముఖ పత్రికలలో ప్రచురితమవు తుంటాయి. అటువంటి వ్యక్తి ఉపన్యాసం ఉందనేసరికి ఒక్క యూనివర్శిటీ విద్యార్థులేకాక నగరంలోని అనేకమంది కూడా వచ్చారు.

యూనివర్శిటీ కాంపస్‌లోని టాగోర్ ఆడిటోరియం సభికులతో కిటకిటలాడిపోతోంది. అంతా నిశ్శబ్దంగా ఉండి ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. సభాధ్యక్షులైన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్-డాక్టర్ మదన్‌ని గురించి వివరంగా సభికులకు పరిచయం చేశారు.

తర్వాత డాక్టర్ మదన్ ఉపన్యసించడానికి లేచారు.

సంతోషంతో సభికులు కొట్టిన చప్పట్లతో హాలు దద్దరిల్లిపోయింది. వారికి వినమ్రతతో తలవంచి నమస్కరించాడు డాక్టర్ మదన్.

సద్దుమణిగాక అయన తన ఉపన్యాసాన్ని ప్రారంభించాడు.



"గౌరవనీయులైన అధ్యక్షుల వారికి, వేదికమీదున్న పెద్దలకు సభికులకూ అందరికీ నా నమస్కారములు. సాధారణంగా నాకు ఇటువంటి సమావేశాలలో పాల్గొనే తీరిక ఉండదు. కాని ఇది కంప్యూటర్ ఇంజనీరింగ్‌కి సంబంధించిన వారు ఏర్పాటు చేసిన సమావేశం కావడంతో తప్పనిసరిగా వచ్చాను. ఈ సమావేశం కేవలం విద్యార్థులూ, అధ్యాపకులకు పరిమితమైనదయ్యుంటే నేను ఇచ్చే ఉపన్యాసపు స్థాయి వేరుగా ఉండేది. అయితే ఇక్కడ ఎందరో ఈ రంగం గురించి పరిచయం లేనివారు ఉండడంవల్ల అందరికీ ఆసక్తిని కలిగించే కొన్ని సామాన్య విషయాలను ప్రస్తావించదలుచుకొన్నాను."

సభలో మళ్ళీ చప్పట్లు మ్రోగాయి. ఈసారి చప్పట్లు కొట్టినవారు ప్రధానంగా విద్యార్థులు, అధ్యాపకులు కానివారు.

"నిజం చెప్పాలంటే కంప్యూటర్ అనేది చాలా సామాన్యమైన పరికరం. కాల్క్యులేటర్లు రాకముందు విద్యార్థులూ వ్యాపారస్థులూ ఉపయోగిస్తుండిన స్లైడ్ రూల్ ఒక విధమైన కంప్యూటరే. ఇంకా చెప్పాలంటే మన తాతల కాలం నుంచీ పిల్లలకు కూడికలు, తీసివేతలు నేర్పడానికి తీగలకి రంగుల గోలీలు ఉండే పలకలు కంప్యూటర్లకి ప్రోటోటైప్స్ అంటే తొలి రూపాలు అనుకోవచ్చు. ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉన్న కంప్యూటర్ ఏదంటే కాల్క్యులేటర్. ఎన్నో ఘన కార్యాలు నిర్వహిస్తున్న కంప్యూటర్లు మౌలికంగా నిర్వహించేవి రెండే రెండు-కూడిక, తీసివేతలు. మరి హెచ్చవేత, భాగాహారముల సంగతేమిటి? నిజానికి ఈ రెండూ కూడా కూడిక, తీసివేతలకు మారురూపాలే. ఎలాగంటే ఉదాహరణకి నాలుగు నాలుగులెంత

అన్న ప్రశ్న వచ్చిందనుకోండి. మనకి ఎక్కాలు వచ్చు కనుక నాలుగు నాలుగులు పదహారు అనేస్తాం. నిజానికి ఈ పదహారు ఎలా వచ్చింది? నాలుగుని నాలుగుసార్లు కలిపితే అంటే 4+4+4+4 చేస్తే వచ్చిందన్నమాట. కంప్యూటర్ ఇలాగే లెక్కిస్తుంది. అదే భాగాహారమనుకోండి. 9/3 అన్న దానిని మనం అలవాటుగా 9/3=3 అని చెప్పేస్తాం. అదే కంప్యూటర్ అయితే 9 నుంచి 3ను తీసుకుంటూ వెళ్తుంది. అంటే 9 - 3 = 6, 6 - 3 = 3 ఇలా అన్నమాట. అంటే కంప్యూటర్లు నిర్వహించేవి ప్లస్, మైనస్‌లే అయితే మరి ఈ కంప్యూటర్ల ప్రత్యేకత ఏమిటి? మనం ఎక్కాల్ని కొద్ది సంఖ్యలకి కొద్దిరెట్లు మాత్రమే చేయగలం. కంప్యూటర్ అలా కాదు. లక్షలు కోట్లు ఉన్న సంఖ్యలని కూడా గుణించగలదు. భాగించగలదు. అన్నిటినీ మించిన ప్రత్యేకత వీటికున్న వేగం. ఎంత పెద్ద లెక్కనైనా ఊహకి అందనంత వేగంతో చెయ్యగలవు కంప్యూటర్‌లు".

డాక్టర్ మదన్ ఉపన్యాసం సాగుతోంది. సభికులలోనుంచి ఒకరు కాగితం మీద ఒక ప్రశ్న రాసి అధ్యక్షులకి పంపించారు.

అది చూస్తూ అధ్యక్షులవారు కొంచెం ముఖం ముడుచుకొని "సభికులకు ఒక విజ్ఞప్తి. ఇది వార్షిక సమావేశంకాని చర్చా వేదిక కాదు. అందువల్ల ఎవ్వరూ ప్రశ్నలు పంపవలదని మనవి" అన్నారు మైకును దగ్గరకు లాక్కుని.

డాక్టర్ మదన్ అధ్యక్షుల ముందున్న కాగితాన్ని పరికించి చూశారు. దానిమీద కంప్యూటర్‌కి సంబంధించిన ప్రశ్న ఉంది.

"చూడండి. ఉత్సాహంకొద్దీ వారు ప్రశ్న పంపినపుడు సమాధానం చెప్పకుండా దాటేసి నిరుత్సాహపరచడం భావ్యంకాదు.

అందువల్ల కేవలం ఐదు ప్రశ్నలకు సమాధానం చెప్తాను. వాటిని ఆధారంచేసుకొనే నా ఉపన్యాసాన్ని కొనసాగిస్తాను' అన్నాడు డాక్టర్ మదన్.

అదే విషయాన్ని సభికులకు తెలియజేసి తనకివచ్చిన కాగితం మీది ప్రశ్నను చదివాడు అధ్యక్షులవారు.

కంప్యూటర్ మౌలికంగా గణకయంత్రం అన్నారు. బాగానే ఉంది. కాని పెద్ద పెద్ద కంప్యూటర్‌లు సమాచారాన్ని విశ్లేషిస్తూ విచక్షణా జ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాయి. మరి వీటికి ఆలోచన ఉందంటారా? ఉంటే ఇవి మానవ మస్తిష్కంతో సమానమైనవా? లేదా ఇంకా ఎక్కువ ప్రతిభకలిగినట్టివా? ఇదీ ప్రశ్న.

ఆ ప్రశ్న విని చిరునవ్వు నవ్వాడు డాక్టర్ మదన్.

"ఎంత గొప్ప కంప్యూటర్ కూడా మానవ మస్తిష్కాన్ని మించలేదు. ఎందుకంటే ఆ కంప్యూటర్‌లను రూపకల్పన చేసి తయారుచేసింది మానవ మస్తిష్కమే కనుక. అయితే కంప్యూటర్‌లో వున్న గొప్పతనమల్లా అమిత వేగంతో నిర్ణయాలు తీసుకోవడం, పరిష్కారాలు సూచించడం. ఇవి కూడా మనిషి అందించిన సమాచారం ఆధారంగానే ఉంటుంది. అందువల్ల మన ఫీడింగ్ సక్రమంగా ఉంటే దాని నిర్ణయాలూ సమంజసంగా ఉంటాయి. మీకు ఉదాహరణ చెప్తాను. అమెరికాలో ఒకసారి మనుష్యులకి అత్యుత్తమమైన పోషకాహారం ఏదీ అన్న సమస్యను కంప్యూటర్‌కి ఇచ్చారు. మనిషి దేహానికి కావలసిన ప్రొటీన్లు,

కార్బోహైడ్రేటులు, ఫాట్స్, విటమిన్‌లు వంటివి ఏయే పరిమాణంలో ఉండాలో ఫీడ్ చేశారు. ఇవి ఉన్నటువంటి రకరకాల ఆకుకూరలు, కాయగూరలు, పళ్ళు, చేపలు, మాంసం, గ్రుడ్లు వంటి వాటి వివరాలను కూడా అందజేశారు. కంప్యూటర్ క్షణాలలో ఆలోచించి సమాధానం చెప్పేసింది. ఏమనో తెలుసా? మనిషికి అవసరమైన నిష్పత్తిలో పోషక పదార్థాలున్నది పచ్చగడ్డియని"-

హాలు నవ్వులతో మార్మోగిపోయింది.

ఆ సందడి తగ్గాక మళ్ళీ ఉపన్యాసం మొదలుపెట్టాడు డాక్టర్ మదన్.

"ఇందులో కంప్యూటర్‌ను తప్పుపట్టాల్సింది ఏమీలేదు. దానికి ఫీడ్ చేసిన సమాచారం ప్రకారం సక్రమమైన సమాధానమే చెప్పింది.

"ఇదే మనిషనుకోండి. పదార్థాలలోని ఆహారపు విలువలను దృష్టిలో పెట్టుకొని మరేదైనా సూచించేవాడు కాని పచ్చగడ్డిని మాత్రం కాదు. అదే మనిషికీ కంప్యూటర్‌కీ తేడా"

హాలులో మళ్ళీ నవ్వులు విరిశాయి.

ఈ లోగా మరో ప్రశ్న అధ్యక్షుల వారిని జేరింది.

దానిని ఆయన డాక్టర్ మదన్‌కి అందించాడు.

"రిమోట్ కంట్రోల్ అంటారు. దానికీ కంప్యూటర్‌కీ ఏమైనా సంబంధం ఉందా?"

ఇదీ రెండో ప్రశ్న.

"తప్పకుండా ఉంది. ఈ రెంటికీ అవినాభావ సంబంధమే ఉంది. మనుష్యుల ప్రమేయంలేకుండా దూరంతో నిమిత్తం లేకుండా కంప్యూటర్‌ల సహాయంతో ఎటువంటి క్లిష్ట కార్యాలనైనా నిర్వర్తించవచ్చు. నిజానికి ఇటువంటి కార్యాల్ని కంప్యూటర్‌లు మాత్రమే చేయగలవు కాని మనుష్యులు చేయలేరు. ఉదాహరణకి రష్యనులు చంద్రుని మీదికి ఒక మూన్‌బగ్గీని పంపారు. అది భూమినుంచి కంప్యూటర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం చంద్రుని ఉపరితలం మీద చాలా దూరం తిరుగాడింది. ఇది రిమోట్ కంట్రోల్‌తో సాధ్యమైనదే. అదే విధంగా ఈనాడు ఐ.సి.బి.యంలు అంటే ఖండాతర క్షిపణులు భూమి మీద ఏ లక్ష్యాన్నయినా సూటిగా ఛేదించగలవు. ఇదీ రిమోట్ కంట్రోల్ వల్లనే. పోతే ఈనాడు రోబోట్‌లను అంటే మరమనుషులను తయారుచేసి అనేక పరిశ్రమలలో, సంస్థలలో వివిధ కార్యాలను నిర్వర్తిస్తున్నారు. ఉక్కు ఫ్యాక్టరీల వంటి వాటిలో అమిత ఉష్ణం ఉండే కొలిమి దగ్గర మనుష్యులు పనిచేయడం ఎంతో దుస్సాధ్యం. అటువంటి చోట్ల ఈ రోబోలు అతిసునాయాసంగా ఎన్నో కార్యాలు నెరవేరుస్తున్నాయి. జాపాన్‌లో వీటి వాడకం అత్యధికంగా ఉంది. ఇంటిలో నౌకరుగా ఆఫీసులలో అటెండర్లుగా కూడా ఈ రోబోలు ఉపయోగపడ్తున్నాయి. ఇంక ముందు లోతైన గనులలో ప్రమాదకరమైన పరిస్థితులలో మనుష్యులు పనిచేయవలసిన అవసరం ఉండదు. అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎత్తయిన ఇళ్ళలో, మల్టీస్టోరీడ్ బిల్డింగ్స్‌లో మంటల్ని లెక్కచేయకుండా ఈ రోబోలువెళ్ళి ప్రాణాలుకాపాడగలవు. మంటల్ని ఆర్పగలవు. 21 శతాబ్దంలో ప్రపంచమంతటా పరిశ్రమలలో, సంస్థలలో మనుష్యులకంటే ఎక్కువగా రోబోట్‌లే దర్శనమిస్తుంటాయి. దాంతో కార్మిక అశాంతి, స్ట్రైక్‌లు, లాకౌట్లు వంటివి ఉండవు. ప్రపంచ

తటుక్కున మెదిలింది. రోబోల మూవ్‌మెంట్స్‌కి సంబంధించిన లాగ్‌బుక్ ఎంట్రీలను పరిశీలించాడు. ఆ ఐదు సందర్భాలలో కూడా ఆ ఐదు రోబోలూ రిమోట్ కంట్రోల్‌లో లేవు. ఏమాత్రం కదలికలేకుండా ఆ యంత్రాల దగ్గరే ఉంటాయి. అప్పుడు వాటికీ మామూలు ఇనుపముద్దకీ ఏమితేడా ఉండదు. శాస్త్రజ్ఞులు మెషీన్లను చెక్‌చేసిన తర్వాత ప్రోగ్రాంని కంప్యూటర్‌కి ఫీడ్ చేసి రిమోట్ కంట్రోల్ ఆన్‌చేసి వెళ్ళిపోతారు. ఆ ప్రోగ్రాం ప్రకారం రోబోట్ తనకి అప్పజెప్పిన విధులను నిర్వర్తిస్తుంది.

ఇటువంటి పరిస్థితులలో ఆ రోబోలకి కదలిక ఎలా వచ్చినట్లు? లాగ్ ఎంట్రీల ప్రకారం, ఆ సమయంలో రిమోట్ కంట్రోల్ జరగలేదు. మరి వాటికి ఉన్నట్లుండి ప్రాణం వచ్చినట్లు ఎలా ప్రవర్తించాయి? ఆ రోజుల్లో కంప్యూటర్‌కి ఏం ప్రోగ్రాం ఫీడ్ చేశారోనని వాటిని కూడా పరిశీలించాడు మదన్. ఆ రికార్డు వివరాలు కూడా ఆ రిపోర్టులో ఉన్నాయి. వాటి ప్రకారం ఆ రోజు కూడా నార్మల్‌గా రొటీన్ ఫీడింగ్ జరిగింది కాని ప్రత్యేకించి మరేమీ లేదు. మరో విశేషం. ఆ రోబోట్‌లు ఆ శాస్త్రవేత్తలని చంపివేయగానే అచేతనం అయిపోయాయి. అంటే రిమోట్ కంట్రోల్ ఆగిపోయిందన్నమాట. దీన్నిబట్టి ఒక నిర్ణీత పథకం ప్రకారం ఎవరో కావాలనే వేరెక్కడనుంచో రిమోట్ కంట్రోల్ చేసి ఉద్దేశపూర్వకంగా ఆ రోబోట్‌ల చేత ఆ హత్యలు చేయించి ఉండాలి. ఇంతటి ఘాతుకం ఎవరు చేస్తారు?

ఆలోచనలతో డాక్టర్ మదన్ బుర్ర వేడెక్కిపోయింది.

ఆలోచనలను మార్చడం కోసం ఎదురుగా ఉన్న బుక్‌షెల్ఫ్ దగ్గరకెళ్ళి పుస్తకాలు తిరగవేయసాగాడు. అక్కడ అన్నీ సైంటిఫిక్ బుక్సే. 'కాస్మిక్‌రేస్' 'గామారేడియేషన్' 'పల్సార్స్' 'రేడియో అస్ట్రానమీ' వంటి పుస్తకాలు అవన్నీ. కాసేపు వాటిని తిరగవేసి వచ్చి మంచం మీద నడుంవాల్చాడు. కలత నిద్రలో కూడా దీనిని గురించిన ఆలోచనలే.

* * * *

మర్నాడు ప్రొద్దున తొమ్మిది గంటలకే సకినోవా వచ్చాడు.

అప్పటికి కాలకృత్యాలు ముగించుకుని తిరిగి ఆ రిపోర్ట్‌ను చూస్తూ కూర్చున్నాడు డాక్టర్ మదన్.

"హలో మైడియర్ ఫ్రెండ్. రాత్రి బాగా నిద్రపట్టిందా? రోబోల గురించే ఆలోచిస్తూ కూర్చున్నావా?" అంటూ తాను ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

సమాధానం ఏమీ చెప్పకుండా చిరునవ్వు నవ్వాడు మదన్.

"బైదిబై. రిపోర్టంతా చదివారనుకుంటాను. మీకేమైనా క్లూదొరికిందా?" అన్నాడు సకినోవా.

"దొరికిందని ఖచ్చితంగా చెప్పలేను కాని ఏదో అస్పష్టంగా మనసులో మెదులుతోంది" అన్నాడు మదన్.

"ఏమిటది?" ఆత్రంగా అడిగాడు సకినోవా.

"ఈ ఐదు చావులూ ఒకే సమయంలో జరిగాయి. ఐదుగురూ మంచి ప్రఖ్యాతి వున్న శాస్త్రవేత్తలు. లాగ్ ఎంట్రీల ప్రకారం ఆ సమయంలో రిమోట్ కంట్రోల్ జరగలేదు. ఆ సమయంలో కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో ఏ అంశమూలేదు. అంటే ఇవన్నీ ఎవరో ఒకే వ్యక్తి వేరే చోటినుంచి మరేదో పద్ధతిలో

రోబోట్‌లను కంట్రోల్ చేసి వాటి ద్వారా ఈ హత్యలు చేయించాడన్నమాట"

సకినోవా ముఖం కందగడ్డలాగా ఎరుపెక్కిపోయింది.

"ఫెంటాస్టిక్ నాన్సెన్స్. డాక్టర్. మీరు కూడా ఇంత అబ్‌సర్డ్‌గా, సిల్లీగా ఆలోచిస్తారనుకోలేదు. ఎనీవే యూ ఆర్ టూ స్మార్ట్. మీరు ఆ రిపోర్ట్ చదవడం అయిపోతే ఇచ్చేయండి. తీసుకుపోతాను. అది చాలా ఇంపార్టెంట్ డాక్యుమెంట్" అన్నాడు.

"మిస్టర్ సకినోవా...ఒక రిక్వెస్ట్. ఈ రోజు సరిగ్గా పన్నెండు గంటలకి మికిహిటో చనిపోయిన యంత్రం దగ్గరకి వెళ్ళి ఎగ్జామిన్ చేయాలనుకుంటున్నాను. మీరు కూడా నా దగ్గర వుంటే బాగుంటుంది" అన్నాడు మదన్.

"ఓ. ష్యూర్. యూ ఆర్ ఆల్వేస్ వెల్‌కం. అది సరే పెట్టుకొని పెట్టుకొని పన్నెండు గంటల ముహూర్తం పెట్టారేమిటి? అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితేనో?" అన్నాడు సకినోవా.

"మీరు నా ప్రక్కన ఉంటే నాకేం ప్రమాదం జరుగుతుంది" అన్నాడు మదన్.

"ఓకె దెన్. నేనువచ్చి మిమ్మల్ని పికప్ చేస్తాను. ఉయ్ విల్‌బి దేర్ షార్ట్ బై ట్వెల్వ్".

* * * *

మర్నాడు ప్రొద్దునే పదకొండున్నరకి సకినోవావచ్చి డాక్టర్ మదన్‌ని వెంటపెట్టుకొని ఫ్యాక్టరీకి వెళ్ళాడు. ఇద్దరూ కొంతసేపు ఫ్యాక్టరీలో తిరిగి పన్నెండుకి ఇంకో పది నిమిషాలు ఉండగా మికిహిటో ప్రాణం తీసిన రోబో దగ్గరికి వచ్చారు.

"ఇదుగో...ఈ రోబోటే ఉన్నట్లుండి కదిలి మికిహిటో ప్రాణం తీసింది. ఇదిగో ఈ మెషీన్నే ఆ సమయానికి ఆయన ఎగ్జామిన్ చేస్తున్నారు. పాపం...తన పనిలో మునిగిపోయి ఉన్న ఆయన వెనకాల నుంచి వచ్చిన రోబోట్‌ని గమనించనేలేదు" అంటూ వాటిని చూపించాడు సకినోవా.

"ఐసీ..." అంటూ ఆ రోబోట్ దగ్గరికి వెళ్ళి దానిని పరీక్షించాడు డాక్టర్ మదన్. అది నార్మల్‌గా ఉంది.

"ఆ తర్వాత దీనికికాని ఈ ఫ్యాక్టరీలో మరే రోబోట్‌కి కాని ఆకస్మిక చలనం వచ్చిందా?" అడిగాడు మదన్.

"లేదు నెవర్" అని జవాబిచ్చాడు సకినోవా.

తర్వాత అక్కడి మెషీన్‌ని నిశితంగా పరిశీలించసాగాడు. అందులో ఏముందో ఏమో బాహ్య ప్రపంచాన్ని మరచి అందులో నిమగ్నమైపోయాడు.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

డాక్టర్ మదన్ వెనకనున్న రోబోట్ ఉన్నట్లుండి కదలడం మొదలుపెట్టి వెళ్ళి తన ఇనుప చేతులతో మదన్ పీకను చుట్టినొక్కివేయసాగింది.

డాక్టర్ మదన్ భీకరంగావేసిన కేకతో అందరూ తమ మెషిన్లను ఆపివేసి అక్కడికి పరిగెత్తుకు

వచ్చారు. అప్పటివరకూ ఎవరి పనిలోవారు నిమగ్నమై ఉండడంతో ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు.

సకినోవాతో సహా అందరూ ఆ ఉక్కు పిడికిలిని విడిపించాలని చూశారు కాని అది సాధ్యంకాలేదు. ఒక సైంటిస్ట్ పరిగెత్తుకువెళ్ళి ఆ రోబోని కంట్రోల్‌చేసే రిమోట్ కంట్రోల్‌లను చూసి వచ్చాడు. అది ఆఫ్‌లోనే ఉంది. మరి రోబోట్‌కి చలనం ఎలా వచ్చినట్లు?

రోబో ఇనుప చేతులు మదన్ గొంతును చుట్టివేశాయేకాని ఇంకా బిగించలేదు. ఏం చేయాలో ఎవరికీ పాలుపోవడంలేదు.

"డాక్టర్ సకినోవా ఓవరాల్ పాకెట్లో రిమోట్ కంట్రోలర్ ఉంది. దానిని ఆఫ్ చేయండి. రోబోట్ ఆగిపోతుంది" అన్నాడు డాక్టర్ మదన్ హీనస్వరంతో.

"నా పాకెట్‌లోనా. నాన్సెన్స్. వాట్ డూ యూ మీన్?" అని గట్టిగా అరిచాడు సకినోవా. అతని ముఖం కందగడ్డల్లే ఎరుపెక్కిపోయింది.

'యూనో వాట్ ఐ మీన్" అన్నాడు మదన్.

వెంటనే అక్కడున్నవారిలో ఒక సైంటిస్ట్ సకినోవా పాకెట్ చూడడానికి సిద్ధమయ్యాడు.

సకినోవా రౌద్రరూపం దాల్చాడు.

"హౌ డేర్ యూ ఆర్" ఆయనేదో నాన్సెన్స్ మాట్లాడితే మీరు నమ్మడమేనా?

"ఐ స్ట్రాంగ్‌లీ అబ్జెక్ట్" అని గట్టిగా అరిచాడు సకినోవా.

ఇంతలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కొంతమంది అధికారులతో అక్కడికి వచ్చాడు.

వారిని చూడగానే సకినోవా ముఖాన కత్తివేటుకి నెత్తుటి చుక్కలేదు. పచ్చగావుండే ముఖం తెల్లగా పాలిపోయింది.

"సర్. ప్లీజ్ చెక్ సకినోవాస్ పాకెట్స్" అన్నాడు మదన్.

విశేషాధికారాలున్న పోలీసులను అడ్డగించలేకపోయాడు సకినోవా. ఇన్‌స్పెక్టర్ స్వయంగా సకినోవా జేబులు చూశాడు. ఓవరాల్ పాకెట్‌లో పాకెట్ సైజ్ రిమోట్ కంట్రోల్ ఉంది.

"సర్. దానిని ఆఫ్ చేయండి" అన్నాడు మదన్.

విచిత్రం! వెంటనే రోబో చేతులు విడివడి యధాస్థానానికి వచ్చాయి.

"మిస్టర్ ఐ.జి. సకినోవా నా మీద హత్యాప్రయత్నం చేశాడు. ఇంతకు ముందు రోబోట్‌లు చేసిన ఐదు హత్యలూ కూడా ఈయన చేయించినవే. ప్లీజ్ అరెస్ట్ హిమ్" అన్నాడు డాక్టర్ మదన్.

అక్కడ ఉన్నవారందరూ తమ చెవులను తామే నమ్మలేకపోయారు.

ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టారు.

రహస్యం బయటపడడంతో ఏ విధమైన ప్రతిఘటనా లేకుండా పోలీసులకు లొంగిపోయాడు సకినోవా.

ఇన్‌స్పెక్టర్ జనరల్ అతని చేతులకు సంకెళ్ళువేసి "మీరందరూ కూడా స్టేషన్‌కు రండి. స్టేట్‌మెంట్స్ ఇయ్యాలి" అంటూ ముందుకు సాగాడు.

* * * *

స్టేషన్లో అందరి స్టేట్‌మెంట్‌లూ తీసుకోవడం అయ్యాక "డాక్టర్ మదన్. సకినోవాయే ఈ హత్యలు చేయించాడన్న అనుమానం మీకు ఎందుకు వచ్చింది?" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్ జనరల్.

"సింపుల్. రోబోలు ప్రాణంలేని యంత్రాలు. మనిషి చెప్పినట్లు చేస్తాయేకాని స్వయంగా ఏమీ చేయలేవు. అటువంటిది వాటికి ఆకస్మిక చలనం వచ్చిందంటే తప్పనిసరిగా వాటి వెనక మానవ హస్తం అదృశ్యంగా ఉండి తీరాలి. ఇకపోతే హత్యకు గురియైన వారైదుగురూ అత్యంత మేధావులైన శాస్త్రజ్ఞులు. వారి కృషికి ముఖ్యంగా మికిహిటోకి నోబెల్ ప్రైజ్ వచ్చే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు అందరూ. ప్రతి రంగంలోనూ ప్రొఫెషనల్ జెలసీ అనేది ఉంటుంది. దానివల్ల వారితో పోటీపడలేని వ్యక్తులు అడ్డదారి గుండా పైకిరావాలని చూస్తారు. అందుకోసం తమదారికి అడ్డనుకున్నవారిని అంతంచేస్తారు. వీరు చనిపోతే వచ్చే లాభం ఎవరికి? వారి స్థాయిలోనే ఉండి నోబెల్ బహుమతి పొందగలిగేటంతటి శాస్త్రవేత్తకి. అటువంటివాడు సకినోవా తప్ప మరొకరు లేరు. సకినోవా తన పథకాన్ని అద్భుతంగా వేశాడు. బహుశా ఇది అన్‌సాల్వ్‌డ్ మిస్టరీగా ఉండిపోయేదేమో! అయితే అతని కర్మకాలి నేను రావడం, అతను తన ప్రజ్ఞను నాకు చూపించాలన్న ఉబలాటంతో ఆ రిపోర్ట్ ఇయ్యడం అతని కొంపముంచింది. ఏదో అఫీషియల్ పనిమీద వచ్చిన నేను అతనికే ఎసరు పెడ్తాననుకోలేదు.

ఈ హత్యలలో రెండు ప్రధానాంశాలు నా దృష్టికి వచ్చాయి.

ఈ హత్యల సమయంలో కంప్యూటర్‌కి ఫీడింగ్ కాని రిమోట్ కంట్రోల్‌కాని లేకపోవడం. దీనిని బట్టి ఆ హత్యలను ఆయా ఫ్యాక్టరీలలోని కంప్యూటర్ల మూలంగా కాని, ఆ ఫ్యాక్టరీలో సంబంధించిన వారు కాని చేసినట్లు అనిపించదు.

రెండవది చాలా ముఖ్యమైన అంశం ఈ హత్యలన్నీ సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకే జరిగాయి. ఈ సమయానికీ హత్యలకీ ఉన్న సంబంధం ఏమిటి? అన్‌సాల్వ్‌డ్ మిస్టరీ సిద్ధాంతాన్ని బలపరచడానికి ఈ సమయాన్ని ఎన్నుకున్నారా? కాని నాకు ఈ అంశమే సకినోవా దోషి అన్న నమ్మకాన్ని కలిగించింది. నేను జపాన్‌లో పనిచేస్తున్నప్పుడు సకినోవాతో మంచి పరిచయం ఉండేది. ఆయన సోలార్ రేడియేషన్ మీద ప్రత్యేకించి గామా కిరణాల రేడియేషన్ మీదా గొప్ప పరిశోధనలు చేశాడు. ఆయన పాకెట్‌సైజ్ రిమోట్ కంట్రోలర్‌ని రూపొందించాడు. ఇది గామా కిరణాల ద్వారా రిమోట్ కంట్రోల్ చేస్తుంది. మధ్యాహ్నం పన్నెండు గంటలకి సూర్యుడు నడినెత్తిన ఉంటాడు. ఆ సమయంలో సూర్యుని నుంచి వెలువడే గామా కిరణాలు, కాస్మిక్ కిరణాలు. సోలార్‌విండ్ వంటి ప్రసారాలు అత్యధికస్థాయిలో ఉంటాయి. సకినోవా నిర్మించిన కంట్రోలర్ ఈ గామాకిరణాలను గ్రహించి స్టాటిక్ ఎనర్జీగా ఉంచుతుంది. ఈ కిరణాలను ప్రసారంచేసి కొన్నిమైళ్ళ పరిధిలో రిమోట్ కంట్రోల్ చేయవచ్చు. అయితే ఎప్పుడైనా చేయవచ్చుగా...ఈ పన్నెండుగంటల మిడసరి లగ్నం ఏమిటీ అన్న ప్రశ్న వస్తుంది. పన్నెండు గంటలకి గామా కిరణప్రసారం అత్యధికంగా ఉంటుంది కనుక ఆ సమయంలో ఏ ఇబ్బంది లేకుండా రోబోలతో పని చేయించుకోవచ్చు.

పని అయిపోగానే అఫ్ చేయవచ్చు. కొంచెం సేపట్లోనే ఈ గామా కిరణాలను ఉపయోగించిన సూచన కూడా ఉండదు. ఆ తర్వాత ఎవరైనా ఈ పాకెట్ కంట్రోల్‌ని చూసినా ఎవరికీ ఏ అనుమానమూ రాదు. తనకి అడ్డుగా వున్నవారు తొలగిపోతే తన కృషికి గుర్తింపు వచ్చి నోబెల్ బహుమతి వచ్చే మార్గం సుగమవుతుంది. మరో అంశం కూడా నాకు సకినోవా మీద అనుమానాన్ని కలిగించింది. ఈ ఐదు హత్యలను విచారించడానికి వేసిన కమిషన్‌కి సకినోవాయే ఛైర్మన్. ఎలక్ట్రానిక్స్‌లో అసాధారణమేధస్సు కలిగి ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తి అధ్వర్యంలో తయారయిన రిపోర్టు ఎంతో నిర్దుష్టంగా నిశితంగా, విపులంగా కూలంకషంగా చర్చిస్తూ వుండాలి. కాని ఆ రిపోర్టు ఏదో తప్పనిసరి తద్దినంలాగా తయారుచేసినట్లనిపించింది. పైగా 12 గంటల సమయానికున్న ప్రాధాన్యాన్ని ఇందులో ఎక్కడా ప్రస్తావించలేదు. అది పొరపాటుకాదు. డెలిబరేట్‌గా చేసినదేనని అనిపించింది. ఈ అంశం కూడా నాకు సకినోవా మీద వున్న అనుమానాన్ని బలపరిచింది.

మరునాడు సకినోవా వచ్చినపుడు నాకు కలిగిన అనుమానాల గురించి ప్రస్తావించాను. వెంటనే అతను కంగారు పడిపోయాడు.

హడావుడిగా ఆ రిపోర్టు తీసుకొని వెళ్ళిపోయాడు. అతని రహస్యాన్ని కనిపెట్టిన నన్ను కూడా మట్టుపెట్టడానికి పథకం వేస్తాడని అనుమానించాను. ఆ అవకాశం నా అంతట నేనే అతనికి కల్పించి అతన్ని రెడ్‌హాండెడ్‌గా పట్టియ్యాలనుకున్నాను. అందుకనే మికిహిటో చనిపోయిన యంత్రం దగ్గరికి తీసుకువెళ్ళమని కోరాను. నేను అనుకున్నట్లే అతను పాకెట్ కంట్రోలర్ ద్వారా గామారేడియేషన్ మూలంగా రోబోట్‌కి డైరెక్షన్స్ ఇచ్చి నన్ను చంపాలని చూశాడు".

"ఎంత దారుణం! అదృష్టం బాగుంది కాని ఆ రోబో మీ ప్రాణం తీసివేస్తే ఏం జరిగేది?" అన్నాడు ఐ.జి.

మదన్ చిరునవ్వు నవ్వాడు. "మృత్యు ముఖంలోకి వెళ్తున్న విషయం తెలిసిన నేను నా జాగ్రత్తలో ఉండనా! పన్నెండు గంటలకి సూర్యుని నుంచి కాస్మిక్ కిరణాల రేడియేషన్ కూడా అత్యధికంగా వస్తుంది. ఈ కిరణాలు గామాకిరణాల కంటే చాలా శక్తిమంతమైనవి. వీటిని గ్రహించి ప్రసారం చేయగల పాకెట్ కంట్రోలర్ నా దగ్గరుంది. సరిగ్గా పన్నెండు గంటలకి ఆరోబో నా మెడచుట్టూ ఇనపచేతులు వేయగానే నా కంట్రోలర్‌ని ఆన్ చేశాను. అందులోని కాస్మిక్ కిరణాలు, ఆ గామా కిరణాల సిగ్నల్స్‌ని న్యూట్రలైజ్ చేశాయి. అందుకే ఆ రోబో ఇంకా ముందుకు సాగలేకపోయింది. నేను అది నా పీకపిసికి వేస్తున్నట్లుగా నటించి గావుకేక పెట్టాను. నిజానికి నాకు ఏ ప్రమాదమూ జరగలేదు." అని వివరించాడు మదన్.

"అంతాబాగానే ఉంది. సరిగ్గా సమయానికి పోలీసులు ఎలా వచ్చారు?" అని అడిగాడు వారితో వచ్చిన ఒక సైంటిస్ట్.

"ఎప్పుడైతే నాకు సకినోవాయే అసలైన దోషి అన్న నమ్మకం కలిగిందో, అతను నన్ను తప్పక చంపాలని ప్రయత్నిస్తాడనిపించింది. అందుకే ప్రొద్దునే ఐ.జిని స్వయంగా కలిసి ఆ ఐదుహత్యల రహస్యం బయటపడ్తుందని, సరిగ్గా పన్నెండు గంటలకీ అక్కడకి రమ్మనికోరాను. అప్పుడు నేను ఆయనకి పూర్తి వివరాలుకాని, సకినోవాని అనుమానిస్తున్నట్లు కానీ చెప్పలేదు. కానీ నాబోటి బాధ్యత గల వ్యక్తి కోరడంతో ఆయన నా మాటలమీద విశ్వాసం ఉంచివచ్చారు" అన్నాడు మదన్.

"అరే కీర్తి కండూతి మనిషిని ఎంతటి నైచ్యానికి దిగజారుస్తుంది!" అని ఆశ్చర్యపోయారు అక్కడివాళ్ళు.

ఆ మర్నాడే స్వదేశానికి తిరిడి వచ్చేశాడు మదన్.

* * * *

ఎనిమిది నెలలు గడచింది.

నోబెల్ బహుమతి వివరాలు వెల్లడయ్యాయి.

ఫిజిక్స్‌లో సకినోవాకు బహుమతి వచ్చింది. అయితే అతను హత్యానేరాల్లో ఇరుక్కొని కేసు విచారణలో ఉన్నందువల్ల అతని కృషిని గుర్తించినా అతనికి బహుమతి ఇయ్యకూడదని నిశ్చయించారు. ఆ వార్త చదివి "పూర్‌ఫెలో... మిగిలిన వాళ్ళకి వస్తుందేమోనన్న భయంతో వారిని అడ్డు తొలగించాడేకాని ఏం బావుకున్నట్లు? ఆ నేరం చేయకపోయినా అతనికే వచ్చేది" అని నిట్టూర్చాడు మదన్.

అదేరోజు జపాన్ ప్రభుత్వం నుంచి డాక్టర్ మదన్‌కి ఒక ఉత్తరం వచ్చింది. 'పరిష్కారం దొరకని హత్యానేరాలను కూపీతీసినందుకు వారి జాతీయ దినాన సన్మానించదలచినట్లు బంగారు పతకం, నగదు, ప్రశంసాపత్రం, గౌరవబిరుదం ఇయ్యనున్నట్లు' అందులో ఉంది.

'నేను పైకి రావాలనుకొని తానుపాతాళంలోకి క్రుంగిపోయి నన్ను పైకి తీసుకువచ్చాడన్నమాట సకినోవా? అందుకే అంటారు ఎవరికేది ప్రాప్తమో' అని అనుకున్నాడు డాక్టర్ మదన్.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, నవంబర్ 1987** ✪